# పంజరం నుంచి ప్రపంచానికి!

ఎన్. శివనాగేశ్వరరావు

సూర్యుడు పశ్చిమాన అస్తమిస్తున్నాడు.

ఆ దృశ్యం చూసిన రాజారామ్‌కి తన జీవితం తలపుకొచ్చింది. తనది కూడా అస్తమిస్తున్న సూర్యుడి స్థితే. జీవితం ఆఖరు మజిలీలో ఉన్న తనకు తోడెవ్వరూ లేరు. అందుకు చింతకూడా లేదు అనుకున్నాడతను.

అరవై వసంతాలు చూసిన వయసు అతనిది. జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నాడు. కష్టాల్లో, సుఖాల్లో అతనికి బాసటగా నిలిచిన ఇల్లాలు మరణించి మూడేళ్ళయింది.

అతని ఒక్కగానొక్క కొడుకు అమెరికాలో స్థిరపడ్డాడు. కొడుకు దూరంగా ఉంటున్నందుకు అతను బాధపడలేదుగాని, తల్లి మరణించిన సంగతి తెలిసినప్పుడు రాగలిగిన పరిస్థితి ఉన్నా రాకుండా ఫోన్ ద్వారా కండోలెన్సెస్ చెప్పినప్పుడు మాత్రం రాజారామ్ బాధపడ్డాడు. మనిషి మనస్తత్వం తెలిసినవాడు కాబట్టి త్వరగానే సర్దుకున్నాడు. ఆ తరువాత అతను మరెన్నడూ కొడుకు గురించి ఆలోచించలేదు.

రాజారామ్‌ది మొదటినుంచి ప్రణాళికాబద్ధమైన జీవితం. అతను ఏపని చేసినా నిర్దిష్టంగా ఉంటుంది. అతనికి మొదటి నుంచి ఆరోగ్య విషయంలో శ్రద్ధ ఎక్కువ. ఉదయాన్నే లేవడం... ఒక మైలు కాలినడక.. మితాహారం.. అత్యాశలకుపోక ఉన్నదానితో నిశ్చింతగా బ్రతకడంతో అతని శరీరం, మనసు రెండూ ఎప్పుడూ ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉంటాయి.

అందుకే అరవయ్యో ఒడిలోపడినా.. ఎవరూ తోడు లేకపోయినా.. రాజారామ్ తన పనులు తను చేసుకుంటూ ప్రశాంతంగా రోజులు గడుపుతున్నాడు.

ఒంటరి జీవితంలో అతనికి నేస్తాలు పుస్తకాలు. చిన్న కుటీరం లాంటి ఇంటిలో ఒక గదినిండా పుస్తకాలే! రకరకాల పుస్తకాలు! రవీంద్రనాధ్ టాగోర్, చలం, కృష్ణశాస్త్రి, శరత్‌బాబు, గోపీచంద్, విశ్వనాధ్, తిలక్, అడవి బాపిరాజు.. ఎందరో రచయితల పుస్తకాలు.

మొదటి నుంచీ రాజారామ్‌కి సాహిత్యమంటే పిచ్చి. పుస్తకాలు చదువుతుంటే సమయం తెలిసేది కాదు. అది తెలిసిన అతని భార్య సుతారంగా మందలించి లైట్ ఆర్పి అతన్ని నిద్రపుచ్చేది.

ఇప్పుడామె లేదుకాబట్టి అతన్ని వారించే వారెవ్వరూ లేరు. చదివిన పుస్తకాలే మరలా మరలా చదువుతుంటాడు.

అతని హోమ్‌లైబ్రరీ చాలా అందంగా, పొందికగా ఉంటుంది. పుస్తకాలన్నీ ర్యాక్స్‌లో వరుసగా సర్దిఉంటాయి. ప్రతి పుస్తకానికీ నంబర్ ఉంటుంది. అతను చదివిన పుస్తకం మరలా అదే క్రమంలో పెట్టేస్తాడు.

రాజారామ్‌కి పరిచయస్తులు తక్కువ. అందుకే ఎవరూ అతన్ని పుస్తకాలు అడగరు. అడిగినా ఇవ్వనని నిష్కర్షగా చెప్పగల మనస్తత్వం అతనిది. తను అపురూపంగా చూసుకునే పుస్తకాలు నలిగినా, చిరిగినా భరించలేడు.

రాజారామ్‌కి తనదగ్గరున్న పుస్తకాలు చూస్తుంటే చాలా సంతోషంగా, గర్వంగా ఉంటుంది. తన ప్రియనేస్తాలందరూ తనతోపాటుగా తనింట్లోనే ఉంటున్నభావన కలుగుతుంది.

అతను సాధారణంగా ఊరు విడిచివెళ్ళడు. కానీ చిన్ననాటి నేస్తం రఘుపతికి పక్షవాతం వచ్చిందని తెలిసాక రెండ్రోజులు వెళ్ళివచ్చాడు.

నింపాదిగా నడుచుకుంటూ ఇల్లు చేరేసరికి ఎంట్రన్స్ తలుపు తాళం పగలగొట్టబడి ఉంది. అతను లోపలకు వెళ్ళి చూసాడు. వంటగదిలో సామాన్లు ఎక్కడివక్కడే ఉన్నాయి. బట్టలు... వాల్ క్లాక్.. అలారంపీస్ అన్నీ ఉన్నాయి. మరి దొంగ ఏం దోచుకుపోయి ఉంటాడు? పాపం ఒఠి చేతులతో వెళ్ళి ఉంటాడు అని నిట్టూర్చాడు రాజారామ్.

అతను స్నానం చేసి విశ్రాంతి తీసుకుంటూ ఉండగా, రెండ్రోజుల నుంచి ఏ పుస్తకమూ చదవని విషయం జ్ఞప్తికొచ్చింది. అతను పుస్తకాల గదిలోకి వెళ్ళాడు.

పుస్తకాల ర్యాక్‌లో కొంత ఖాళీ ఉంది. రాజారామ్ భృకుటి ముడిపడింది. అక్కడుండే పుస్తకాలు ఎవరో తీసారు. రాజారామ్‌కి తన ఇంట్లో ఏం దొంగిలించబడ్డాయో అర్ధమయింది.

అతను ఆత్రుతగా పోయిన పుస్తకాలు ఏమిటో వెదికాడు. అతని ముఖంలో ఆశ్చర్యం చోటుచేసుకుంది. అవి అతనెంతో అభిమానించే పుస్తకాలు. పైపెచ్చు ఎక్కడా దొరకనివి.

రాజారామ్ తనింట్లోకి వచ్చిన దొంగ మీద కోపం తెచ్చుకున్నాడు. కానీ ఆ దొంగ అభిరుచిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

ఆ రాత్రంతా రాజారామ్ తన లైబ్రరీలోని పుస్తకాలు దొంగిలించిన దొంగ గురించే ఆలోచించాడు. అంత మంచి అభిరుచి ఉన్న ఆ పుస్తకాల దొంగను ఒక్కసారి చూడాలనిపించింది. సుదీర్ఘంగా ఆలోచించాడు.

ఆ దొంగ పుస్తకాలు దొంగిలించడానికే వచ్చాడని రూఢి అయింది. అంటే అతనికి తనవద్దనున్న మంచి పుస్తకాల గురించి ఎలా తెలిసింది? తప్పక తనతో సాన్నిహిత్యం ఉన్న వాళ్ళెవరో చెప్పిఉండాలి.

ఆ ఆలోచన వచ్చాక రాజారామ్ తన స్నేహితులతో తన ఇంట్లో జరిగిన దొంగతనం గురించి చెప్పి

పుస్తకాల ర్యాక్‌లో కొంత ఖాళీ ఉంది. రాజారామ్ భృకుటి ముడిపడింది. అక్కడుండే పుస్తకాలు ఎవరో తీసారు. రాజారామ్‌కి తన ఇంట్లో ఏం దొంగిలించబడ్డాయో అర్ధమయింది. అతను ఆత్రుతగా పోయిన పుస్తకాలు ఏమిటో వెదికాడు. అతని ముఖంలో ఆశ్చర్యం చోటుచేసుకుంది. అవి అతనెంతో అభిమానించే పుస్తకాలు. పైపెచ్చు ఎక్కడా దొరకనివి. రాజారామ్ తనింట్లోకి వచ్చిన దొంగ మీద కోపం తెచ్చుకున్నాడు. కానీ ఆ దొంగ అభిరుచిని మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

''అంత మంచి అభిరుచి ఉన్న దొంగను ఒక్కసారి చూడాలని ఉంది. అతను నన్ను కలవాలేగాని కోప గించడం కాదు.. అభిమానిస్తాను, అభినందిస్తాను'' అని చెప్పాడు. అతని పథకం ఫలించింది.

వారం తరువాత ఓ యువకుడు వచ్చి అతన్ని కలిసాడు. ''నాపేరు శ్రీకాంత్'' అని పరిచయం చేసుకున్నాడు. అతన్ని అంతకు ముందెన్నడూ చూసిన జ్ఞాపకం లేదు.

ఆ యువకుడు సిగ్గుపడుతూ ''క్షమించాలి. మీ ఇంట దొంగతనంగా ప్రవేశించి పుస్తకాలు పట్టుకెళ్ళిన దొంగను నేనే'' అని చెప్పాడు.

రాజారామ్ సంభ్రమంగా ఆ యువకుడి వంక చూసాడు. వయసు ఇరవై ఉంటుంది. బహుశా డిగ్రీ చదువుతూ ఉండి ఉండాలి. ముఖంలో మంచి వర్చస్సు ఉంది. కళ్ళు చురుకుగా ఉన్నాయి.

రాజారామ్ తనను పరిశీలించడం గమనించి ''క్షమించండి. దొంగతనం నేరమే! కానీ...'' అని ఆగాడు శ్రీకాంత్.

''చెప్పు'' అన్నాడు రాజారామ్.

''మీకు రాజాజీ తెలిసే ఉంటారు. అతను మా నాన్నగారికి మంచి స్నేహితుడు. మీదగ్గరున్న పుస్తకాల గురించి ఎప్పుడూ చెబుతూ ఉంటారు. అందులో కొన్ని పుస్తకాలు లైబ్రరీలో కూడా దొరకవు. మీరు పుస్తకాలు ఎవరికీ ఇవ్వరని ఆయన చెప్పారు. నిజానికి ఆ పుస్తకాలు చదవాలన్న కాంక్షే నన్ను దొంగతనానికి సైతం పురికొల్పింది'' చెప్పాడు శ్రీకాంత్.

రాజారామ్ నవ్వాడు. ''నీవు దొంగిలించిన పుస్తకాలనుబట్టి నీ అభిరుచి గ్రహించాను. నిజానికి ఆ పుస్తకాలు నాకూ ఎంతో ఇష్టమైనవి'' అని క్షణమాగాడు.

''అందుకే భద్రంగా తెచ్చాను'' అని చేతిలోని పుస్తకాలు రాజారామ్‌కి అందించాడు శ్రీకాంత్. రాజారామ్ అతన్ని కూర్చోబెట్టి ''నీ నిజాయితీకి మెచ్చి ఇవి నీకే బహుమతిగా ఇస్తున్నాను. స్వీకరించు'' అని ఆ పుస్తకాలు శ్రీకాంత్‌కే ఇచ్చేసాడు.

అటువంటిది ఊహించని శ్రీకాంత్ సంతోషం పట్టలేకపోయాడు. ''థాంక్యూ వెరీమచ్'' అని కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

''నిజానికి నేనే నీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. జీవితంలో నేనెప్పూ చేయలేదని నాకు గట్టి విశ్వాసం. నీవు చేసిన దొంగతనం నా విశ్వాసాన్ని దెబ్బతీసింది. ఆ తప్పు సరిదిద్దుకోవడానికి రేపే నా హోమ్‌లైబ్రరీలోని పుస్తకాలనన్నింటినీ పబ్లిక్ లైబ్రరీకి డొనేట్ చేయడానికి నిర్ణయించుకున్నాను'' అని చెప్పాడు రాజారామ్.

శ్రీకాంత్, రాజారామ్ వద్ద సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

రాజారామ్ దృష్టి గోడకు వ్రేలాడుతున్న సరస్వతీ దేవి క్యాలండర్‌మీద పడింది. చదువుల తల్లి వదనంలో అంతకుముందు లేని సంతృప్తి అతనికి గోచరమయింది.

రాజారామ్ వద్దనున్న పుస్తకాలకే మాటలుంటే 'మంచిపని చేయబోతున్నావు మిత్రమా! ఇంతకాలం నీకు పంచిన విజ్ఞానం, ఆనందం, మానసిక ప్రశాంతత మరెందరికో పంచుతాం' అని ఉండేవి.

★

